




ప్రతీ వ్యక్తికి ఆధ్యాత్మిక చింతన అవసరం


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మోమిన్‌పేట్, మే 8(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీ వ్యక్తికి ఆధ్యాత్మిక చింతన అవసరమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సయ్యద్ అలీపూర్‌లో హనుమాన్ ఆలయ ధ్వజ స్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపన, నాభిశిల, జలాధివాస పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా స్పీకర్ హాజరయ్యారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో విరివిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మానసిక ప్రశాంతతకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, మానయ్య, సురేందర్, ఏరాజ్, సుభాష్ బంటు వెంకటేశం, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

నీటి కోసం ఆందోళన

శామీర్‌పేట, మే 8(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా తమ కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. మండలంలోని లాల్‌గడి మలకపేట పంచాయతీ పరిధి ఇందిరమ్మ కాలనీకి నల్లా నీరు సరఫరా కావడం లేదు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నీటి సమస్యపై పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో బైఠాయించారు. ఏ గ్రామంలో లేని నీటి సమస్య తమకే ఎందుకని కాలనీవాసులు సెక్రటరీని నిలదీశారు. నెల రోజులుగా చెబుతున్నా నీటి సరఫరాపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మహిళలు అధికారులను, సిబ్బందిని నిలదీశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. త్వరలోనే నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నచ్చజెప్పడంతో కాలనీ వాసులు శాంతించారు.

పాతాళానికి నీరు


భారీగా పడిపోయిన భూగర్భ జలమట్టాలు

ఎండలు ముదిరిన తరుణంలో నీటి వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో భూగర్భ జలమట్టాలు సైతం వేగంగా పడిపోతున్నాయి. వికారాబాద్ జిల్లాలో గతేడాది ఇదే సమయంతో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సరాసరి అదనంగా రెండు మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పోయాయి. గతేడాది వర్షపాతం తక్కువ ఉండడం.. బోర్లు, బావుల ద్వారా పంటలకు నీటి వినియోగం పెరడంతో నీటి మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. దీనికి పెరుగుతున్న ఎండలూ తోడవుతున్నాయి. మిగతా మండలాలతో పోలిస్తే దుద్యాలలో మరింత లోతుల్లోకి నీరు పోయింది. ఈ నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నెలకొనే సూచనలు కన్పిస్తున్నాయి.

భూగర్భ జలమట్టాలు ఇలా..

సంవత్సరం	నెల	నీటి మట్టాల లోతు
2023	ఏప్రిల్	14.70 మీటర్లు
2024	ఏప్రిల్	15.90 మీటర్లు
2025	ఏప్రిల్	16.75 మీటర్లు

వట్టిపోయిన బోర్లు, బావులు
అత్యధికంగా దుద్యాలలో 57.05 మీటర్ల లోతుకు జలం
పొంచి ఉన్న తాగునీటి గండం





వికారాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి తీవ్రం కావడంతో జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. ఎండల తీవ్రత, వినియోగం పెరిగి భూగర్భ జలమట్టాలు శరవేగంగా తగ్గిపోతున్నాయి. భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడేస్తుండడంతో నీరు పాతాళానికి చేరుతోంది. కొన్ని గ్రామాల్లో బావులు, బోర్లలో నీటిమట్టాలు పడిపో యి తాగు, సాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నెలలో ఉష్ణోగ్రతలు మరింత పెరగడం తథ్యం కావడంతో నీటి వినియోగం హెచ్చి జలమట్టాలు మరింత లోతుకు పోవడం ఖాయం. గతేడాది ఏప్రిల్‌లో 15.9 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోతే 2025 ఏప్రిల్‌లో 16.75మీటర్ల లోతుకు పడిపోయాయి. 2024 మార్చి నెలకు, ఈ ఏడాది అదే నెలకు పోల్చిచూస్తే జిల్లాలో 3మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. దీన్ని బట్టి జిల్లాలో భూగర్భ జలాలు ఎంత మేర తగ్గుతున్నాయో స్పష్టమవుతోంది. ఏప్రిల్ నెలాఖరుకు జిల్లాలో దుద్యాల, మర్పల్లి, వికారాబాద్, దోమ మండలాల్లో 20మీటర్ల కంటే ఎక్కువ లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. నవాబ్‌పేట, పరిగి,

మిగతా 8వ పేజీలో...

రెండేళ్లలో 2.05 మీటర్ల వ్యత్యాసం

జిల్లాలో 2023 ఏప్రిల్ నెలకు, 2025 ఏప్రిల్ నెలతో పోలిస్తే భూగర్భ జలాలు 2.05 మీటర్ల లోతుకు పడిపోయాయి. 2023 ఏప్రిల్ నెలలో జిల్లాలో భూగర్భ జలాలు 14.70 మీటర్ల లోతులో ఉండగా, 2025 ఏప్రిల్ నెలలో 16.75 మీటర్ల లోతుకు వెళ్లాయి. అదే గతేడాది, ఏప్రిల్‌లో జిల్లాలో నీటి మట్టాలు 15.90 మీటర్ల లోతులో ఉండేవి. ఈ ఏడాది అంత కంటే అదనంగా 0.85మీటర్ల లోతుకు చేరాయి. గత ఏప్రిల్‌లో దుద్యాల మండలంలో 33.5 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా, ఈ యేడు ఏప్రిల్‌తో పోలిస్తే 57.05 మీటర్లకు పడిపోయాయి. మోమిన్‌పేట్‌లో గతేడాది 9.9 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది 10.38 మీటర్ల లోతుకు వెళ్లాయి. అదే నవాబ్‌పేట మండలంలో గత ఏడాది 13.46 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 15.53 మీటర్లకు పడిపోయాయి. వికారాబాద్ మండలంలో గత ఏడాది 16.27 మీటర్ల లోతులో ఉండగా, ఈసారి 27.0 మీటర్లకు చేరాయి. దోమ మండలంలో 17.43మీటర్ల నుంచి 13.53 మీటర్లకు పడిపోయాయి. తాండూరు మండలంలో 14.96 మీటర్ల నుంచి 17.65 మీటర్ల లోతుకు చేరాయి. బషీరాబాద్‌లో 12.58మీటర్ల నుంచి 12.84 మీటర్లకు పడిపోయాయి.

ఆపరేషన్ సిందూర్ సంఘీభావ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సైన్యానికి సెల్యూట్

పరిగి, మే 8(ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్ర మూకలను మట్టుబెట్టడం గర్వంగా ఉందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం పరిగిలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండియన్ ఆర్మీ వ్యూహాత్మక దాడులతో తొమ్మిది ఉగ్రస్థావరాలపై దాడులు చేయడం అభినందనీయమని అన్నారు. ఇండియన్ ఆర్మీ సేవలను ఎప్పుడూ మరిచిపోలేమని, తానూ ఆర్మీ కుటుంబం నుంచి వచ్చినవాడనేనని ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయాలను పక్కనబెట్టి దేశ రక్షణను తాము మొదటి ప్రాధాన్యంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు, పార్టీ పట్టణాధ్యక్షుడు ఇకృష్ణ, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, పి.చినర్సింహులు, ఆనెం ఆంజనేయులు, శాంతకుమార్ పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, మే8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమీ అఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(లాలిమ్) నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సర్వేయర్ గురువారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణలోని ఎక్కడి మీ సేవ కేంద్రంలో అయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియెట్(గణితశాస్త్రం ఒక సబ్జెక్టుగా ఉండాలి)లో కనీసం 60శాతం మార్కులు ఉండాలని, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డిప్లొమా(సివిల్), బీటెక్(సివిల్)లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారం మే 5 నుంచి 17 వరకు మీ సేవ కేంద్రాల్లో వంద రూపాయలు చెల్లించి పొందాలని, ఈ నెల 17 దరఖాస్తుకు చివరి తేదీయని తెలిపారు.

జల వనరులు.. కాలుష్య కాసారాలు

- నేడు మురుగునీటి కేంద్రాలు
- నీరంతా కలుషితం ... ప్రమాదంలో ప్రజారోగ్యం
- పట్టించుకోని అధికారులు

నాడు తాగు, సాగు నీరందించిన చెరువు, కుంటలు


ఎన్ఎఫ్‌సీనగర్ రాయికుంట చెరువులోకి చేరుతున్న మురుగు నీరు

ఘట్‌కేసర్, మే 8(ఆంధ్రజ్యోతి): వందల ఏళ్లపాటు సాగు, నీరందించిన గొలుసుకట్టు చెరువులు, కుంటలు నేడు మురుగు నీటితో కాలుష్య కాసారాలుగా మారి జీవులకు ముప్పు తెచ్చాయి. చెరవు, కుంటల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణం. పట్టణీకరణతో జలవనరులు కనుమరుగవుతున్నాయి. ఉన్నవాటిల్లోనే కలుషిత నీరే చేరుతోంది. ఘట్‌కేసర్‌లోని రాయికుంట, చటేరుకుంట, చిన్నచెరువు, ఎరిమల్లెవాగు, పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ, నారపల్లిలోని అన్ని చెరువుల్లోనూ

మిగతా 8వ పేజీలో...


ఎరిమల్లెవాగులో పరుచుకున్న గుర్రపు డెక్క(ఫైల్)

చేపలు చనిపోతున్నాయి



చెరువులు, కుంటల్లో మురుగునీటితో చేపలు చనిపోతున్నాయి. వాటికి తగినంత ఆక్సిజన్ లభించడం లేదు. దీంతో చెరువులపై ఆధారపడిన ముదిరాజ్, బెస్తల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. యేటా చేపపిల్లలను వదుల్తున్నా అవి చనిపోతున్నాయి. బతికున్న వాటిని సైతం కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. మురుగు నీటిలో పెరిగాయిని అంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే చెరువుల పరిరక్షణ చర్యలు చేపట్టాలి.

- మేడబోయిన వెంకటేశ్, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్



సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

- మున్సిపాలిటీల్లో '100 డేస్' ప్రోగ్రాం
- జూన్ 2 నుంచి ప్రారంభం
- పారిశుధ్యం, పచ్చదనం
- సౌకర్యాల కల్పనపై ప్రత్యేక కార్యక్రమాలు

6


తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారిని కోరుతున్న రైతులు

ధాన్యాన్ని త్వరగా తరలించాలి

ఘట్‌కేసర్ రూరల్,మే8(ఆంధ్రజ్యోతి): వర్షాల పడుతున్నందున కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని త్వరగా తరలించేలా అధికారులు రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని రైతులు డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ వెంకటరమణారెడ్డిని కోరారు. గురువారం ఏదులాబాద్, మాదారం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా మిల్లులకు తరలించడంలేదని రైతులు వాపోయారు. లారీలు రాక రాత్రి, రాత్రింబవళ్లు వడ్ల కుప్పల వద్ద కాపలకాస్తున్నామన్నారు. మిల్లర్లు లోడ్‌లను వెంటవెంటనే దించుకోవడం లేదని.. తాలు ఉందని ప్రతీ సంచికి 1.5 కిలోల తరుగు తీస్తామంటున్నారని రైతులు చెప్పారు. గతంలో ఆరు మిల్లులకు ధాన్యాన్ని తరలించేవారమని, ఇప్పుడు రెండు మిల్లులకే పంపుతుండడంతో సమస్య ఉత్పన్నమవుతోందని మేనేజర్ తెలిపారు. ధాన్యంలో తాలు, మట్టి లేకుండా చూసుకోవాలన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంటా వేసిన వెంటనే వడ్లను మిల్లుకు పంపాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


మంబాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న లింగ్యానాయక్

పెద్దేముల్/బొంరాస్‌పేట్, మే 8(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని, ఈ విషయంలో ఆలస్యం చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కొనుగోలు కేంద్రం ఇంచార్జ్‌లను ఆదేశించారు. పెద్దేముల్ మండలం మన్సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులతో మాట్లాడారు. వెంటవెంటనే తూకం వేస్తున్నారా? వేచి ఉంచుతున్నారా? అని రైతులను అడిగారు. కాంటా వేసిన వడ్లను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు జిల్లాలో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 12,275 టన్నుల వడ్లు కొన్నట్టు చెప్పారు. కొన్న ధాన్యానికి రైతులకు రూ.12కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట డీసీఎస్‌వో వి.మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ డి.మోహన్‌కృష్ణ ఉన్నారు. అలాగే బొంరాస్‌పేట్ మండలంలోని దేవనూర్, కొత్తూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను లింగ్యానాయక్ తనిఖీ చేశారు. తూకం వేసిన వేసిన ధాన్యం సంచులకు వెంటనే ట్యాగింగ్ చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆయనతో డీసీఎస్వో వి.మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ డి.మోహన్ కృష్ణ ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయండి

తాండూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇందిరమ్మ కమిటీలు అందజేసిన దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తిచేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య కోరారు. గురువారం ఆయన హౌసింగ్ డీఈఈ, ఏఈలతో కలిసి తాండూరు మున్సిపల్ అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, తాండూరులో వచ్చిన 554 దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని కమిషనర్, మేనేజర్‌లను కోరారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని, ముగ్గురు గెజిటెడ్ అధికారుల మార్గదర్శకాలను అనుసరించి ఎంపిక ఉండాలని పీడీ కోరారు. ఈ స్కీంకు రెండో దశ ఎంపిక కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను పంపాలని మున్సిపల్ మేనేజర్‌కు సూచించారు. ఇంటి స్థలం కనీసం 60స్క్వేర్ యార్డుల్లో ఉండాలన్నారు. అంతకు మించి విస్తీర్ణంలో ఇంటిని నిర్మిస్తే బిల్లులు ఇవ్వరని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి శోభాయాత్ర




తాండూరు పట్టణంలో నిర్వహించిన ఊరేగింపులో మహిళల కోలాట నృత్యం

తాండూరులో కన్యకా పరమేశ్వరి శోభాయాత్రను బుధవారం అర్ధరాత్రి వరకు భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. నగరేశ్వరాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర వినాయకచౌక్, శాంతి మహల్ చౌరస్తా, భద్రేశ్వర్ చౌక్, గాంధీ చౌక్‌ల మీదుగా నగరేశ్వరాలయానికి చేరుకుంది. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు కోలాట నృత్యాలు, గీతాలాపన చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. విద్యుత్ లైట్ల వెలుగుల్లో శోభాయాత్ర ప్రజలను ఆకట్టుకుంది. ఈ యేడాది పెద్ద ఎత్తున ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- తాండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి)


జ్ఞానేశ్వర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఏలూరి శ్రీనివాసరావు

తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్

వికారాబాద్, మే8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అటవీ శాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. గురువారం గజిటెట్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ సభ్యులు కోటాజీ, రామారావు, సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి హాజరయ్యారు. ఎన్నికల్లో సంఘం జిల్లాఅధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు ఎంపీవో సఫియుల్లాఖాన్, సంయుక్త కార్యదర్శిగా ఫర్హీన్ ఖాతూన్ ఎన్నికయ్యారు. గజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యవర్గం పనిచేయాలని ఏలూరి శ్రీనివాసరావు అన్నారు.

దారి తప్పించిన గూగుల్ మ్యాప్!

పెన్నా సిమెంటు కర్మాగారానికి వెళ్లాల్సిన ట్యాంకర్ గ్రామ శివారుకు..

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి బీభత్సం

తాండూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్ పెట్టుకొని డ్రైవ్ చేసిన పెన్నా సిమెంటు కర్మాగారం ట్యాంకర్ దారి తప్పింది. కర్మాగారానికి వెళ్లాల్సిన ట్యాంకర్ మరో గ్రామం వైపు వెళ్లింది. ఈ సంఘటన గురువారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముంబయి నుంచి సిమెంటు ట్యాంకర్(ఎంహెచ్46బీయు9705) నుంచి తాండూరు మండలం బెల్కటూర్ పరిధి పెన్నా సిమెంట్ కర్మాగారానికి బయల్దేరింది. ట్యాంకర్ డ్రైవర్ గూగుల్ మ్యాప్ పెట్టుకొని ప్రయాణయ్యాడు. గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ట్యాంకర్ బెల్కటూర్‌కు బదులుగా గూగుల్ మ్యాప్ వీరారెడ్డిపల్లి వైపు చూపడంతో డ్రైవర్ అదే మార్గంలో వెళ్లాడు. దీంతో ట్యాంకర్ శివారులోని విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది.



విద్యుత్ స్తంభాలకు తగిలి నిలిచిన సిమెంట్ ట్యాంకర్

తెగిపడ్డ విద్యుత్ వైర్లు

పొలాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇది గమనించిన గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వీరారెడ్డిపల్లి, బెల్కటూర్ గ్రామాల శివార్లు కలిసి ఉండటంతో రెండు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డు మీదుగా వెళ్తే ట్యాంకర్ కర్మాగారానికి చేరుకునేది. కానీ గూగుల్ లొకేషన్‌తో వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడ్డ పొలంలో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పిందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి కొంత మేర గడ్డి దగ్ధమైంది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ వైర్లు, స్తంభాలకయ్యే ఖర్చు భరిస్తామని లారీ యజమాని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. డ్రైవర్ గూగుల్ మ్యాప్ పెట్టుకుని నిర్లక్ష్యంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

మున్సిపాలిటీల్లో 100 డేస్ ప్రోగ్రాం

జూన్ 2 నుంచి ప్రారంభం

ప్రణాళికలు రూపొందించాలని సీడీఎంఏ ఆదేశం

పారిశుధ్యం, పచ్చదనం ప్రజారోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు




తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో 100 డేస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. జూన్ 2 నుంచి సెప్టెంబరు 12 వరకు వంద రోజులు చేపట్టి పట్టణ స్థాయిలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సీడీఎంఏ మంగళవారం కమిషనర్లను ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి మున్సిపాలిటీల్లో సమస్యల పరిష్కారమే ఎజెండాగా '100 డేస్ ' ప్రోగ్రాం చేపడుతున్నారు. పారిశుధ్యం, పచ్చదనం, ప్రజారోగ్యం అంశాలపై ఈ ప్రోగ్రామ్‌లో దృష్టి పెడతారు. మున్సిపాలిటీ వార్డుల్లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో కార్యక్రమంలో డ్రెయిన్లలో పూడిక తీత, ఖాళీ స్థలాల్లో బుష్ కట్టింగ్, పచ్చదనంలో భాగంగా నర్సరీలు పెంపు, పార్కుల అభివృద్ధి, ఎవెన్యూ ప్లాంటేషన్, మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చూడడం వంటి పనులు చేపడతారు.

విభాగాల వారీగా కార్యక్రమాలు

మెప్మా ఆధ్వర్యంలో కొత్తగా మహిళా గ్రూప్‌లను ఏర్పాటు చేయడం, స్ట్రీట్ వెండర్లకు సర్టిఫికెట్ల అందజేత, రుణాలివ్వడం వంటి వాటిపై ప్రణాళికలు తయారు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు వైద్య శిబిరాలను నిర్వహించాలి. ప్రజలకు క్యాన్సర్, కంటి వంటి శిబిరాలను నిర్వహించాలి. టౌన్ ప్లానింగ్ వారు గుర్తించిన పార్కుల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయాలి. వెంచర్లలో పది శాతం స్థల అభివృద్ధికి అవసరమైన ఫైల్ తయారు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని సీడీఎంఏ సూచించింది.

8 మంది డీఎస్పీల బదిలీ



హైదరాబాద్, మే8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 8మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖాజీపేట ఏసీపీగా పి.ప్రశాంత్‌రెడ్డి, మేడ్చల్ ఏసీపీగా సీహెచ్ శంకర్‌రెడ్డిని బదిలీ చేసి ఇక్కడున్న బి.శ్రీనివాసరెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. శంషాబాద్ ఏసీపీగా వి.శ్రీకాంత్‌గౌడ్, నర్సంపేట ఏసీపీగా పి.రవీందర్‌రెడ్డిని బదిలీ చేసి ఇక్కడున్న కిరణ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. కాచిగూడ ఏసీపీగా వై.హరీష్‌కుమార్, వైరా ఏసీపీగా సారంగపాణిని నియమించి ఇక్కడున్న ఎంఏ రహీంను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.



మణివీర్, మధులిక తేజలను సన్మానిస్తున్న న్యాయవాదులు

యువ న్యాయవాదులకు సన్మానం

షాద్‌నగర్ అర్బన్ మే, 8(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపికైన షాద్‌నగర్‌కు చెందిన యువ న్యాయవాదులు సి.మణివీర్, డాకన్నగారి మధులిక తేజలను న్యాయవాదులు ఘనంగా సన్మానించి, అభినందించారు. షాద్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం బార్ అసోసియేషన్ భవనంలో వారిని సన్మానించారు. సంకల్పం, పట్టుదల ఉంటే ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సి.మణివీర్, డాకన్నగారి మధులిక తేజలు నిరూపించి షాద్‌నగర్ గౌరవాన్ని పెంచారని ఈ సందర్భంగా న్యాయవాదులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్, కోశాధికారి లింగంగౌడ్, సహాయ కార్యదర్శి నర్సింహులు, న్యాయవాదులు ఎంఏ కరీం, కంచి రాజ్‌గోపాల్, చెంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పాతపల్లి కృష్ణారెడ్డి, కట్టి గంగాధర్, శివరాములుగౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్త, ప్రభాకర్‌గౌడ్, కె.మనోహర్‌రెడ్డి, కె.శంకరయ్య, బి.రమేష్, కె.జయమ్మ, శ్రీశైలం, విజయ్‌కుమార్, ఇంజమూరి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన నిలిపిన బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- విరిగిన కమాన్ పట్టీలు.. ప్రయాణికుల భయాందోళన
- డ్రైవర్ అప్రమత్తత.. అందరూ క్షేమం

చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి కోస్గి వెళ్లే బస్సు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కన నిలిపాడు. దాంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మండల పరిధిలోని మీర్జగూడ గేట్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబ్‌నగర్ జిల్లా కోస్గి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని చేవెళ్ల పట్టణం మీదుగా కోస్గికి బయలుదేరింది. బస్సు నడుస్తుండగానే ప్రమాదవశాత్తు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో డ్రైవర్ బాల్యానాయక్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి ఆపాడు. ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కాగా, బస్సుల్లో దాదాపు 50 మందికిపైగా ప్రయాణికులున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం ప్రయాణికులను బయటకు దింపి మరో బస్సులో పంపించారు. పోలీసులు ఘటన పరిస్థితిపై డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యర్థుల నవ్వులు



నవ్వులు చిందిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వారు ముగ్గురూ ప్రత్యర్థులు. రాజకీయంగా పోటీపడుతూ ఒకరంటే ఒకరికి పడని వారు. అయితే వారు ఒకే వేదికపై కలిశారు. అంతేకాదు.. ఒకరినొకరు పలకరించుకుంటూ నవ్వులు చిందించారు. ఈ దృశ్యం జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్‌లో గురువారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. అందులో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ), తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (కాంగ్రెస్), ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్) ఒకే వేదికపై కూర్చున్నారు. వీరి మధ్య మాటలు కలిసి ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకోవడం అక్కడున్నవారిని ఆకర్షించింది. ఎప్పుడూ ఒకరిపై ఒకరు రాజకీయ పరంగా తిట్టుకునే వారు ఇలా నవ్వులు పూయించడం చూసిన పలువురు 'అమ్మో! రాజకీయ నాయకులంతా ఒక్కటే' అంటూ చర్చించుకున్నారు. ఒకే పార్టీకి చెందినప్పటికీ మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలు తాండూరు పర్యటనలో ఇటీవల కాలంలో కలిసి పాల్గొన్న దాఖలాలు లేవు. వీరిద్దరూ తాండూరు నియోజకవర్గంలో వేర్వేరుగా పర్యటిస్తూ కనిపిస్తుండటం గమనార్హం.



రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రెవెన్యూ సదస్సుల్లో 36 దరఖాస్తుల స్వీకరణ

ధారూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డమీది గంగారం, నర్సాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 36 దరఖాస్తులు అందాయి. ఈ సదస్సుల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికాబాద్ ఆర్డీవో వాసుచంద్రలు పాల్గొని భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. భూసమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా గతంలో పరిష్కారానికి నోచుకోని పలు భూసమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా గడ్డమీది గంగారంలో 24, నర్సాపూర్‌లో 12దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, డీటీ విజయేందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ చీఫ్‌విప్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

తాండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ నగరంలో గురువారంఆయన నివాసంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ప్రతినిధుల బృందం సమస్యలను వినతిపత్రం అందజేశారు. ఈనెల 10వ తేదీన నిర్వహించే రాష్ట్రస్థాయి పంచాయతీ కార్యదర్శుల సదస్సుకు రావాలని చీఫ్‌విప్‌ను ఆహ్వానించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల కాలం పూర్తిచేసుకొని క్రమబద్ధీకరించిన వారికి ప్రభావిత తేదీని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని వారు కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామ పంచాయతీలకు ఉపాధిహామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని వారు కోరారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి సీతక్కలతో చర్చిస్తానని, సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజ్, గౌరవ అధ్యక్షుడు సందీప్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సుధాకర్ పాల్గొన్నారు.



బ్రహ్మపుత్ర విత్తనాల కంపెనీలో విత్తనాలను, రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు

నాణ్యత లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు

శామీర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): విత్తనాల కంపెనీల్లో అనుమతి లేని, నాణ్యత లేని విత్తనాలను అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ హెచ్చరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో గల పలు విత్తనాల కంపెనీల్లో గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విత్తన ధృవీకరణ ఏడీ శివకుమార్ మండల వ్యవసాయధికారి రమేశ్, ఎస్‌వోటీ ఎస్ఐ రోహిత్‌లు ఆకస్మిక తనిఖీలు చేశారు. దేవరయాంజాల్ పరిధిలోని డెన్మార్క్ సీడ్స్, యూని వెజ్‌సీడ్స్, మహికో విత్తన కంపెనీ, బ్రహ్మపుత్ర సీడ్స్, సిరి సీడ్స్, కోరమండల్ సీడ్స్ కంపెనీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆ విత్తన కంపెనీల్లోని స్టాక్ విత్తనాలను, రికార్డులను, స్టాక్ బోర్డులను ఆ అధికారులు తనిఖీ చేసి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. నిబంధనలను ఉల్లంఘించి విత్తనాలను సరఫరా చేస్తే విత్తన చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్నాపూర్‌లో వీధి నాటకం



వీధి నాటకంలో పాత్రధారులు

నవాబుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్నాపూర్ గ్రామంలో రెండు రోజులుగా వీరభద్ర విజయం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. వీధి నాటకాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. కులమతాలకతీతంగా వీధి నాటకంలో పాల్గొని జానపద యక్షగానాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలకు గ్రామీణ ప్రాంతాల్లో జీవం పోయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బెంగళూరు పోలీసులమంటూ మోసం!

పెండింగ్ చలాన్ల పేరిట కుచ్చుటోపీకి యత్నం!.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



వికారాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను చెల్లించాలంటూ బెంగళూరు పోలీసుల పేరుతో ఓ వాహనదారుడికి కుచ్చుటోపీ పెట్టాలని సైబర్ నేరగాళ్లు ప్రయత్నించారు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిల ప్రకారం.. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని రాచయ్య కాలనీకి చెందిన అయ్యన్‌గౌడ్‌కు ఈనెల 2వ తేదీన బెంగళూరు పోలీసుమంటూ ఫోన్ నంబర్ 78423 32912 నుంచి కాల్ వచ్చింది. కర్ణాటకలో మీరు కొనుగోలు చేసిన టాటా వాహనం (కేఏ03 ఏకే 3447-పాత నంబర్), టీజీ 10 టీ 3072 (కొత్తనంబర్)పై రూ.15 వేల పెండింగ్ చలానాలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని, వరుసగా మూడుసార్లు కాల్ చేశారు. కర్ణాటక పాసింగ్ వాహనం కొనుగోలు చేసింది వాస్తవం కావడంతో తనకు కాల్ చేసింది బెంగళూరు పోలీసులేనని అయ్యన్‌గౌడ్ నమ్మాడు. తాను ఇటీవలనే ఆ వాహనం కొనుగోలు చేశానని, ఏవైనా చలాన్లు ఉంటే వాహనం పాత యజమాని చెల్లిస్తాడంటూ వారికి చెప్పే ప్రయత్నం చేశాడు. అదంతా కుదరదని, వాహనం మీ వద్ద ఉన్నందున మీరే చెల్లించాలంటూ వత్తిడి చేయడంతో ఆన్‌లైన్‌లో చలాన్ల వివరాల కోసం ప్రయత్నించగా ఏమీ వెల్లడి కాలేవు. ఈ విషయాన్ని తనకు ఫోన్ చేసిన వారికి తెలియజేయగా, కర్ణాటక చలాన్లు తెలంగాణలో కనిపించవని, వెంటనే డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. డబ్బులు చెల్లించకపోతే వాహనాన్ని తీసుకు వెళ్తామంటూ బెదిరించారు. ఈ వ్యవహారమంతా సైబర్ నేరగాళ్ల పనే అయి ఉండవచ్చని భావించిన అయ్యన్‌గౌడ్ 5న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెంగళూరు పోలీసులమంటూ అయ్యన్‌గౌడ్‌కు ఫోన్ చేసిన వారు సింగారపు రాచయ్య కాలనీకి చెందిన వారేనని పోలీసుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది. బెంగళూరు పోలీసుల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

నిర్లక్ష్యం నీడలో క్రీడా ప్రాంగణాలు

నిర్వహణ లేక పొదలమయంగా ఆటస్థలాలు

అక్రమంగా మట్టి తవ్వకాలు.. నిరుత్సాహంలో క్రీడాకారులు



గాలిగూడ గుట్టల్లో క్రీడా ప్రాంగణం

చౌదరిగూడ, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. వాటిల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, స్కేటింగ్ తదితర గ్రౌండ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ప్రాంగణాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. అదీగాక నిర్వహణ లోపంతో అక్కడున్న క్రీడాసామగ్రి తప్పుపడుతోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ, ధర్మ్యతండాలో క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథుడు లేడు. ప్రాంగణాలు గుంతలమయంగా, పెద్ద బండరాళ్లతో నిండి ఉన్నాయి. క్రీడా పరికరాలు తుప్పుపట్టాయి. మండలంలో 24 పంచాయతీలకు 18 క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. జాకారం, ఎల్కగూడ, చేగిరెడ్డి ఘణాపూర్, రావిర్యాల గ్రామాల్లో స్థలం లేక ప్రాంగాణాలను ఏర్పాటు చేయలేదు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి క్రీడా ప్రాంగణాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు, యువకులు అంటున్నారు. దీంతో ప్రాంగణాలన్నీ చెట్టు పుట్టలతో దర్శనమిస్తున్నాయన్నారు. కొందరు క్రీడా ప్రాంగణాల్లో మట్టి త్రవ్వకాలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేదు. ఇప్పటికైనా అధికారులు క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని ధర్మ్యతండా క్రీడా ప్రాంగణం

పిచ్చి మొక్కలతో నిండిపోయింది



గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వం క్రీడ ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే వాటి నిర్వహణ లేక పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించి గ్రౌండ్‌లను చదును చేయించి ఆటలు ఆడుకునేందుకు అనుకూలంగా మార్చాలి.

- నిశ్చల్ దీపక్, క్రీడాకారుడు, తుమ్మలపల్లి

స్నేహితుడికి స్కూటీ అందజేత

- దివ్యాంగుడి పట్ల మానవత్వం చాటుకున్న సత్యనారాయణరెడ్డి



స్కూటీని అందిస్తున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మానవత్వం చాటుకున్నారు. చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో 1980-81 బ్యాచ్ టెన్త్ క్లాస్‌మేట్ చేవెళ్ల మండల పరిధిలోని అల్లావాడకు చెందిన దివ్యాంగుడు కావలి హనుమయ్య ఆయనకు చిన్నానాటి స్నేహితుడు. అయితే, అతనికి రెండు కాళ్లు లేవు. హనుమయ్య రెండు చేతులతో నడుస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల పాటు ఎలక్ట్రిక్ సైకిల్‌ను నడిపాడు. అది కాస్త రిపేర్‌కు రావడంతో హనుమయ్య ఇంటికే పరిమితమయ్యాడు. ఇటీవల పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో హనుమయ్య పరిస్థితి చూసి స్కూటీ ఇప్పిస్తానని సత్యనారాయణరెడ్డి తెలిపాడు. గురువారం తన డబ్బుతో కొనుగోలు చేసిన స్కూటీని హనుమయ్యకు అందజేశాడు. కాగా, దాని విలువ రూ.లక్షా 30 వేలు కాగా.. నాలుగు చక్రాలు కలిగి ఉంది. స్కూటీని కొనుగోలు చేసి చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్నేహితులందరి సమక్షంలో ప్రత్యేక పూజలు చేయించి స్నేహితుడు హనుమయ్యకు తాళం చేవిని సత్యనారాయణరెడ్డి అందజేశారు. దాంతో హనుమయ్య హర్షం వ్యక్తం చేశాడు. తనకష్టాన్ని గుర్తించి స్నేహితుడు స్కూటీని బహూకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపాడు. అలాగే వారి తోటి స్నేహితులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్నేహితులు విజయ్‌కుమార్, కుంచం సంతోష్‌కుమార్, ఖాజాపాషా, రాములు, మల్లయ్య, యాదయ్య, ప్రభులింగం, వెంకటయ్య, ఎం.జనార్దన్, శంకరయ్య, గోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములు, చంద్రయ్య, నాయకులు యాలాల మహేశ్వర్‌రెడ్డి, ఆరుణ్‌కుమార్, అంజిరెడ్డి, జంగయ్య గౌడ్, బాపిరెడ్డి, కాసుల రాఘవేందర్‌గౌడ్ తదితరులున్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కార్మికులు

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

కొడంగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈ నెల 20న జరిగే సీఐటీయూ దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పకీరప్ప, మొగులప్ప, రమేశ్, మహేశ్, వెంకటలక్ష్మీ, సుగుణమ్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య, సబిత కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులకు గురువారం కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం కార్మికులతో కలిసి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనచట్టంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న చేపట్టిన సమ్మెలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, సత్తమ్మ, పద్మ, రాంచందర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

యాచారం, మే 8(ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకురాలు(సూపరింటెండెంట్) శైలజ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పైపులైన్ లీకవ్వకుండ చూడాలన్నారు. కూలీలకు ప్రతి రోజు ఉపాది చూపడంపై కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. రాజీవ్‌యువ వికాస్ పథకం కాలపరిమితి ముగిసిందన్నారు. ప్రతి రోజు కూలీలకు ప్రతి నెల వేతనాలందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆ మె చెప్పారు. సమావేశంలో ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శైలజ



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మంత్రి పొన్నంకు వీర్లపల్లి శుభాకాంక్షలు

షాద్‌నగర్ అర్బన్, మే, 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంత్రిని సన్మానించి, అభినందనలు తెలిపారు. ఆయనతో చౌదరిగూడ మండల కాంగ్రెస్ నాయకుడు కేకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భీంరెడ్డి రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ప్రణవి, చంద్రయ్య

భీంరెడ్డి రాంరెడ్డికి ఆత్మీయ సన్మానం

కందుకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన భీంరెడ్డి రాంరెడ్డి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖలో మెదక్ జిల్లా నర్సాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు. బుధవారం రాత్రి మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో ఆయనకు పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు ప్రణవి, చంద్రయ్యలతో పాటు సూపరింటెండెంట్లు అంజిరెడ్డి, విజయభాస్కర్‌లు రాంరెడ్డి-వనిత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో ప్రజలకు, ప్రభుత్వానికి నిస్వార్థంగా సేవలందించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రాంరెడ్డి ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి అంచలంచెలుగా ఎదిగి ఇన్‌స్పెక్టర్ స్థాయికి వచ్చారని గుర్తుచేశారు. రాంరెడ్డి తోటి ఉద్యోగులు, స్నేహితులు హాజరై సన్మానించారు. నాయకులు జంగారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, వి.రమేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, పున్న భిక్షపతి, మాధారం రమేష్‌గౌడ్, బొక్క నరేందర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, భద్రయ్యలతో పాటు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దేశ రక్షణకు పాటుపడాలి

మహేశ్వరం, మే 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకోసం ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతీ పౌరుడు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని అవేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మాధవన్‌జీ అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు పరిధిలోగల అవేర్ ఆసుపత్రి ప్రాంగణంలో అవేర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మశాంతికి కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అవేర్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వరుణ్, తరుణ్, రమాకాంత్, ఇర్షత్, జాఫర్, ప్రభాకర్, వెంకన్న, గణేష్, రీనా, కళ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రానికి వసతుల కల్పన

- సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు

శామీర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట 3వ అంగన్‌వాడీ కేంద్రానికి నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను మున్సిపల్ డీఈఈ సునీత గురువారం ప్రారంభించారు. తాము కోరిన మేరకు తూంకుంట మున్సిపల్ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సదుపాయాల కల్పన దిశగా చర్యలు చేపట్టడంపై ఐసీడీఎస్ సీడీపీఓ శారద కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఏళ్ల తరబడిగా సరైన డ్రైనేజీ, రోడ్డు, నీటి సౌకర్యంలేక పిల్లలు అనేక అవస్థలకు గురవుతున్నారు. అలాగే కేంద్రం పరిసరాల్లో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యలపై బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీఈఈ సునీత, పంచాయతీ కార్యదర్శి మౌనికలకు ఐసీడీఎస్ సీడీపీఓ శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణిలు ప్రత్యక్షంగా చూపించారు. వెంటనే స్పందించిన అధికారులు ఈ అంగన్‌వాడీ కేంద్రంలో అవసరమైన మౌలిక సౌకర్యాలను యుద్ధప్రాతిపాదికన ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అంగన్‌వాడీ అధికారులకు భరోసా ఇచ్చారు. ఆ మేరకు గురువారం పనులను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులతో కలిసి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

భారత సైనికులకు సంఘీభావం

మేడ్చల్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత సైన్యానికి మద్దతుగా గురువారం మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఉమెన్స్ విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి కళాశాలల ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. దేశంపై ఉగ్రవాదులు చేస్తున్న దాడులను తిప్పి కొట్టడంతో పాటు పహల్గాం ఘటనపై ప్రతీకారం తీర్చుకున్న భారత సైన్యానికి తాము మద్దతుగా విద్యార్థులు పేర్కొన్నారు.

జల వనరులు.. కాలుష్య కాసారాలు

(ఐదో పేజీ తరువాయి)

మురుగు నీరు చేరుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాసుల కక్కుర్తితో చెరువులు కుచించుకుపోయి సెప్టిక్‌ట్యాంకులుగా మారాయి. వీటితో భూగర్భ జలాలూ కలుషితమై ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

కాలుష్యమయం.. మూసీ పరీవాహకం

మూసీనదిలో కలుషిత నీటి ప్రవాహంతో ఘట్‌కేసర్ మండలం సగానికిపైగా కాలుష్యం బారిన పడింది. మండలంలో అతిపెద్ద చెరువైన ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు 30 ఏళ్ల నుంచి మూసీ జలాలతో నింపడంతో కాలుష్యమయమైంది. 800 ఎకరాలకుపైగా విస్తరించి ఉన్న ఈ చెరువు అనేక గ్రామాల ప్రజలకు ఉపయోగపడింది. నాడు చెరువు పరిసరాల్లో బావులు, బోర్ల నీటిని తాగేవారు. నేడు భూగర్భ జలాన్ని దేనికీ వాడుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నీటిలో అనేక విషతుల్య వ్యర్థాలు కలుస్తున్నాయని పరిశోధనల్లో తెలిందింది. మూసీ పరీవాహ ప్రాంత భూముల్లో ఆహారేతర పంటలే సాగు


మురుగునీటితో నిండిన ఎన్ఎఫ్‌సీనగర్ రాయికుంట చెరువు

చేయాలని శాస్త్రవేత్తలు కూడా సూచించారు.

దుర్గంధభరితంగా ఎరిమల్లెవాగు

కీసర మండలం రాంపల్లి సూర్యనారాయణ చెరువు, గోధుమకుంట తీగల నారాయణ చెరువులు నిండి ఎరిమల్లెవాగు పారుతుంది. ఈ వాగు ప్రవాహంతోనే ఎదులాబాద్ చెరువు నిండుతుంది. ప్రస్తుతం అన్ని చెరువుల్లోకి మురుగు నీటిని మళ్లించడంతో అవి ఏడాదంతా నిండుకుండల్లా ఉంటున్నాయి. గతంలో వర్షాలు కురిసినప్పుడే ఎరిమల్లెవాగు పారుతుండేది. కానీ నేడు దీనిలో ఏడాదంతా మురుగునీరు ప్రవహిస్తోంది. చెరువులు, కుంటలు, వాగుల కలుషితంతో వీటి పరిసరాలు గర్గంధభరితం అయ్యాయి. వాటిల్లో గుర్రపు డెక్క పేరుకొని దోమల బెడద తీవ్రమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

చెరువులు, కుంటలు, వాగులు జలవనరుల కలుషితానికి ఆయా ప్రభుత్వం శాఖల అధికారుల నిర్లక్ష్యమే కారణం. భారీ అపార్టుమెంట్లు, కాలనీల మురుగు నీటిని శుద్ధిచేసిన అనంతరమే దిగువకు వదలాలి. కానీ నేరుగా దిగువన ఉండే కుంటలు, వాగుల్లోకి వదుత్తున్నారు. మున్సిపాలిటీల్లో భూగర్భ డ్రైయిన్ల నీటిని నేరుగా పారిస్తున్నారు. సెప్టిక్ ట్యాంకులు నిర్మించకుండ పైప్‌లైన్లకు కలుపుతున్నారు. ఆ మురుగంతా నేరుగా చెరువులు, కుంటలు, కాలువలు, నదులు, దిగువ ప్రాంతాలకు చేరుతోంది. పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపాలిటీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పట్టించుకోక జల వనరులకు ముప్పు వాటిల్లుతోంది.

మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తా



ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో చెరువుల్లో, కుంటల్లో, వాగుల్లో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తా. జల వనరుల్లోకి మురుగు నీరు చేరితే భూగర్భ జలాలు కలుషితమవుతాయి. ప్రజలకు, పశువులకు ఆరోగ్య సమస్యలొస్తాయి. అపార్టుమెంట్ల నిర్వాహకులు ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని శుద్ధి చేసిన నీటినే వదలాలి. **- పరమేశ్, ఏఈ ఇరిగేషన్**

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు


అధికారులకు వినతులు అందిస్తున్న గ్రామస్థులు

కీసర, మే 8 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కీసరలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కీసరలో గురువారం కీసర దాయర, హరిదాస్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై గ్రామస్థులు, రైతులు 116 దరఖాస్తులు అందజేశారు.

ఘట్‌కేసర్ కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


కురుమ సంఘం నూతన కార్యవర్గం

ఘట్‌కేసర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పట్టణ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట వద్ద జరిగిన సమావేశంలో ఎన్నుకున్న కార్యవర్గం వివరాలిలా ఉన్నాయి. అధ్యక్షుడిగా దయ్యాల లింగం, ఉపాధ్యక్షుడిగా దయ్యాల వెంకటేష్, బి.మహేందర్, ప్రధానకార్యదర్శిగా ఎం.సతీష్, సహాయ కార్యదర్శులుగా బి.కరుణాకర్, చీర పరశురాం, బి.మల్లేష్, కోశాధికారిగా రమేష్, కార్యవర్గసభ్యులుగా నర్సింహా, సుదార్, నవీన్, మహేష్, సలహాదారులుగా శ్రీశైలం, గట్టయ్య, గణపతి, శంకర్, నర్సింహా, అంజయ్య, కుమార్, భరత్‌లు ఎన్నికయ్యారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత


గుంతల్లో మట్టివేయిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

పెద్దేముల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై పడిన గుంతలు ప్రమాదకరంగా మారడంతో మండల తహసీల్దార్ శ్రమదానం చేయడానికి యువతకు పిలుపునిచ్చారు. అయినా యువకుల నుంచి అంతగా స్పందన రాకపోవడంతో తహసీల్దారు వెంకటేష్ ప్రసాద్, ఎస్ఐ.శ్రీధర్‌రెడ్డిలు ఇతరుల సాయంతో రోడ్లపై పడిన గుంతల్లో మట్టివేయించారు. ఎస్కవేటర్, ట్రాక్టర్లు వాడి కొంతవరకు రోడ్లకు మరమ్మతులు చేయించారు. రోడ్లపై పడిన గుంతలను పూడ్చివేయించినందుకు మండల ప్రజలు తహసీల్దారు, ఎస్ఐలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందసేవకు యువకులు కూడా ముందుకు వస్తే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న అలీముద్దీన్

ధారూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా మానవ అక్రమ రవాణ నిరోధక విభాగం హెడ్ కానిస్టేబుల్ అలీముద్దీన్ అన్నారు. మండలంలోని కేరెల్లిగలో శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనీక కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు, మహిళలకు మానవ అక్రమ రవాణపై అవగహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు తినడానికి ఏదైనా ఇస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనబడితే వెంటనే 100కు డయల్ చేసి సమాచారమివ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్, రవీందర్, శ్రీ సత్యసాయి సేవాసమితి కేరెల్లి కేంద్రం బాధ్యులు రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, సాయి బాలవికాస్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపక చైర్మన్ దంపతులు

కీసర రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలోని రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారికి వేదపండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్ మాట్లాడుతూ 18సంవత్సరాలుగా వైకుంఠ ఏకాదశి రోజున ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదవితరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీచైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ లావణ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పాతాళానికి నీరు

(ఐదో పేజీ తరువాయి)

యాలాల్, బంట్వారం, కొడంగల్, కోట్‌పల్లి, దౌల్తాబాద్, బషీరాబాద్, ధారూరు, బొంరాస్‌పేట్, పెద్దేముల్, తాండూరు, కులకచర్ల, పూడూరు, మోమిన్‌పేట మండలాల్లో 10మీటర్ల నుంచి 20మీటర్ల వరకు భూగర్భ జల నీటి మట్టాలు అడుగంటాయి. ఒక్క చౌడాపూర్ మండలంలో మాత్రం భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి.

దుద్యాలలో 57.05 మీటర్ల లోతుకు...

జిల్లాలో అత్యధికంగా దుద్యాల మండలంలో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ మండలంలో 57.05 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయిందని జియాలజీ అధికారులు గుర్తించారు. మర్పల్లి మండలంలో 25.41 మీటర్ల లోతుకు జలాలు చేరగా, వికారాబాద్‌లో 27.0 మీటర్లు, దోమలో 22.18 మీటర్లు, నవాబ్‌పేట్‌లో 15.53 మీటర్లు, పరిగిలో 15.5మీటర్ల లోతుకు చేరుకున్నాయి. యాలాల్‌లో 14.8మీటర్ల లోతులో, బంట్వారంలో 13.92 మీటర్లు, కొడంగల్‌లో 13.73 మీటర్లు, కోట్‌పల్లిలో 13.53 మీటర్లు, దౌల్తాబాద్‌లో 13.52 మీటర్ల లోతులో ఉన్నాయి. అలాగే బషీరాబాద్‌లో 12.84 మీటర్ల లోతులో, ధారూరులో 12.61 మీటర్లు, బొంరాస్‌పేట్‌లో 11.79 మీటర్లు, పెద్దేముల్‌లో 11.74 మీటర్లు, తాండూరులో 11.65 మీటర్లు, కులకచర్లలో 11.33 మీటర్లు, పూడూరులో 10.52 మీటర్లు, మోమిన్‌పేట్‌లో 10.38 మీటర్లు, చౌడాపూర్‌లో 3.98 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయినట్లు గుర్తించారు. గతేడాది వర్షపాతం తక్కువ నమోదవడంతోనే భూగర్భ జలమట్టాలు భారీగా తగ్గాయి. వ్యవసాయానికి బోర్ల నీటి వినియోగం కూడా పెరిగి నీటిమట్టం పడిపోయింది.

పొంచి ఉన్న నీటి గండం?

జిల్లాలో ప్రతి వేసవిలో తాగునీటి సమస్య తప్పడంలేదు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోనూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్లూరు సెగ్మెంట్ నుంచి వికారాబాద్ జిల్లాకు మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోంది. రాఘవాపూర్ సమీపంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాలు, మునిసిపాలిటీల్లోనూ మిషన్ భగీరథ నీరే సరఫరా అవుతోంది. జిల్లాకు రోజూ 87,009 కిలో లీటర్ల నీటి సరఫరా డిమాండ్ ఉంది. వికారాబాద్‌లో మిషన్ భగీరథ కంటే ముందు మంజీరా, శివసాగర్ ద్వారా తాగునీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కొనసాగడంతో శివసాగర్ నీరు వినియోగించడం లేదు. శివారు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఎండలు ముదరనున్నందున ఈ వేసవిలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు భూగర్భ జలాలు పెంపొందించేలా కార్యాచరణ అమలుచేయాల్సిన అవసరం ఉంది.

ప్రణాళికలు సిద్ధం చేయండి


కాళికాదేవి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మే8 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కమిటీ సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. కాళికాదేవి దేవస్థానంలో ఎమ్మెల్యే గురువారం అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై ప్రసంగించారు. ఆలయ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పట్టణంలోని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు ప్రయాణికలు తయారు చేయాలన్నారు. అంతకుముందు దేవాదాయ ధర్మదాయశాఖ అధికారులు నియమించిన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.బస్వరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లాలయ్య, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ధారాసింగ్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

కోట్‌పల్లి: శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎమ్మెల్యే బియ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన చేతులమీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. ఇప్పటికీ 500మంది వరకు చూయించుకున్నారని అందులో 15మందివరకు కంటి పరీక్షలకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లొంక నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, సంగయ్య స్వామి, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్‌లో అధికారులు

పెద్దేముల్, మే8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారుల సూచనలు పాటించాలని హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల అభివృద్ధి అధికారి రతన్ సింగ్‌లు అన్నారు. మండలంలోని కందనెల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అధికారులు సూచించిన విస్తీర్ణంలోనే ఇల్లు నిర్మించుకోవాలని అంతకంటే అదనపు స్థలం ఇంటి నిర్మాణానికి వాడితే వారికి బిల్లులు చెల్లించబడవని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ డీఈ కలీముద్దిన్, ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ అధికారి నర్సింగ్‌రావు, ఏఈ రహీం, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో గురువారం ఏవో, పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిదులు, కో-ఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్ తదితరులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లారు. వారి వివరాలు, పలు సమాచారం అడిగి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, చందు, శేఖర్, షైను, లాలు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ లైన్లను సరిచేయాలి


అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న బాబాగూడ రైతులు

శామీర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైన్లను సరి చేయాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. బాబాగూడ గ్రామానికి చెందిన పలువురు రైతులు శామీర్‌పేట విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి వెళ్ళి అధికారులను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఏడాదిగా సంబంధిత విద్యుత్ అధికారులకు చెప్పుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ వైర్లను సరి చేయకపోతే పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్లు

కులకచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఇప్పయిపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గౌడ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజలో గౌడ సంఘం నాయకులు

కులకచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో గురువారం గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామ గౌడ సంఘం నాయకులు, గ్రామస్థుల సహకారంతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎంఈవో సాయిరెడ్డి

పూడూరు, మే 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనోనిగూడ, కేరవెళ్లి పాఠశాలలో శిక్షణా ఫౌండేషన్ నిర్వహించే పది రోజుల సమ్మర్ క్యాంపును గురువారం ప్రారంభించారు. ఈ క్యాంపు ప్రారంభోత్సవానికి ఎంఈవో సాయిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ గాలయ్య, జంగయ్య, ప్రధానపాధ్యాయ లు షహనాజ్, సంతోష్, ప్రభు, ఫౌండేషన్ మెంటర్ రాకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోట్‌పల్లి: జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఏసీఎస్ మర్పల్లి, మోమిన్‌పేట్ లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఎకరాకు 14క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు 3,371, రూపాయలు ఉందన్నారు.

కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవాబుపేట: వ్యవసాయ పొలానికి వెళ్లకుండా దారిలో కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దాదాపూర్ గ్రామానికి చెందిన వడ్ల రంగాచారి గురువారం కలెక్టర్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్‌డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి ఆయన అనుచరులు కలిసి తమ పొలానికి వెళ్లనివ్వకుండా కంచె ఏర్పాటు చేసి అడ్డు పడుతున్నారని ఆరోపించాడు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచెను తొలగించాలని కోరారు.

నేడు హిందూ ఐక్యత ర్యాలీ

తాండూరు: భారతదేశ కీర్తి పతాకం ఎగురవేసిన తొలి హిందూ మహరాజ్ రాణాప్రతాప్ సింగ్ జయంతి వేడుకల్లో భాగంగా తాండూరులో రాజ్‌పుత్ మహిళ సంఘాల ఆధ్వర్యంలో హిందూ ఐక్యత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు దిలీప్‌సింగ్ ఠాకూర్, శివానంద్‌సింగ్, నిఖితఠాకూర్, పల్లవి ఠాకూర్‌లు తెలిపారు. కాళికాదేవి మందిర్ వద్ద శుక్రవారం (నేడు) ఉదయం 8.30గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని వారు చెప్పారు.

నేడు హకీంపేట, తూంకుంటలో గ్రామ సభలు

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేట, తూంకుంటలలో ఈనెల 9న శుక్రవారం, ఉదయం 10.30 గంటలకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లోని జేబీఎస్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ చేపట్టినట్లు తెలిపారు. సంబంధిత భూ నిర్వాసితులు విచ్చేసి అధికారులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

● పరారీలో మరో ఇద్దరు నిందితులు


ఎక్సైజ్ పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న నిందితులు

ఘట్‌కేసర్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాచారం మల్లాపూర్‌కు చెందిన భాస్కర్‌రావు(25), బొంత సురేష్ అలియాస్ చిన్న(27) హోండా యాక్టీవాపై బోడుప్పల్ నుంచి మల్లాపూర్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఆపి సోదాచేశారు. అందులో దాదాపు రెండు కిలోల గంజాయి పట్టుబడింది. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిస్సా, రాయ్‌గడ్‌లోని బహెరమంతు అనే వ్యక్తి నుంచి మధ్యవర్తి అయిన మల్లాపూర్‌కు చెందిన నల్ల దినకర్ నుంచి గంజాయి కొనుగోలుచేసి చర్లపల్లిలోని శ్రావణ్, బోడుప్పల్‌కు చెందిన సాహిర్, మణితేజాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నల్ల దినకర్, బహెర మంతు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు హోండా యాక్టివా, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు



వికారాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓకారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున వికారాబాద్‌కు చెందిన ఓ కారు అదుపుతప్పి చెరువులోకి వెళ్లగా ఎవరికీ ఎలాంటి అపాయం కలగలేదు. దీంతో కారును బయటకు తీశారు. ఇదిలా ఉంటే గతంలో కూడా ఓ కారు చెరువులో పడి ఓవ్యక్తి మృతి చెందారు. చెరువు కట్టపై రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. వెంటనే రోడ్డును బాగు చేసి వాహనాలు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని అడవి జంతువు దాడిలో లేగదూడ మృత్యువాత

కులకచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాల్‌సింగ్ తండా పరిధిలో గుర్తుతెలియని అడవి జంతువు దాడిలో లేగదూడ మృత్యువాతపడింది. తండాకు చెందిన రైతు సక్రియనాయక్ తనకున్న నాలుగు గేదెలు, రెండు లేగ దూడలను రోజూమాదిరిగా బుధవారం రాత్రి పొలం దగ్గర పాకలో కట్టేసి తండాకు వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా ఒక దూడపాకకు దూరంగా మృతి చెందిపడింది. చుట్టుపక్కల పరిశీలించగా కొన్ని అడుగు జాడలు పడిఉన్నాయి. ఆ జాడలు చిరుతవేనని రైతు సక్రియనాయక్ అనుమానం వ్యక్తం చేశాడు. ఘటనాస్థలాన్ని అటవీ శాఖ అధికారి మోహిన్ పరిశీలించారు. దూడపై దాడి చేసింది చిరుత కాకపోవచ్చనని హైన అయి ఉండొచ్చని తెలిపారు.

నకిలీ దస్తావేజులు సృష్టించి కబ్జాకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులు సృష్టించి ప్లాట్లు కబ్జాకు పాల్పడిన కేసులో న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను పట్టించుకోకుండా మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నల్లకుంటకు చెందిన బి.సురేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురు ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల సర్వేనెంబర్లు 740/పార్టు, 741/పార్టు, 742/ పార్టుల్లోని 6ఎకరాల భూమిని యజమానుల వద్ద కొనుగోలు చేశారు. అయితే కట్యూరి ప్రభాకర్‌రెడ్డి అదే సర్వేనెంబర్‌లలో సురేందర్ రెడ్డి పక్కన గల 6292గజాల భూమిని జీపీఏ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ 15909/2005 ద్వారా కొనుగోలు చేశాడు. కొద్దిరోజుల తర్వాత ప్రభాకర్‌రెడ్డి 6292గజాల భూమిని ఎ.వీరయ్య, పి.సోమిరెడ్డిలకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు 6317/2006, 6318/2006 ద్వారా విక్రయించాడు. ఇంతటితో ఆగకుండా ప్రభాకర్‌రెడ్డి అమ్మిన భూమిని రెండోసారి ఇతరులకు విక్రయించాడు. దీంతో తమకు డబుల్ రిజిస్ట్రేషన్ చేశాడని ప్రభాకర్‌రెడ్డిపై 2011లో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ ఫిర్యాదుతో జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన ప్రభాకర్‌రెడ్డి తన ఒరిజినల్ జీపీఏ డాక్యుమెంట్లైన 15909/2005 ద్వారా 31 నకిలీ దస్తావేజులు తయారు చేసి బి.సురేందర్‌రెడ్డి కొనుగోలు చేసిన భూమిలోని ప్లాట్లను చూపించాడు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు సురేందర్‌రెడ్డి భూమిలోకి వస్తుండటంతో వారిని ఆయన నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో సురేందర్‌రెడ్డి 2019లో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మూడేళ్లుగా కోర్టులో కేసు నడుస్తున్న ప్రభాకర్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో న్యాయస్థానం అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ పోలీసులు పక్కా సమాచారంతో నగరంలోని కొండాపూర్‌లో గురువారం ఉదయం అరెస్టు చేసి, సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు జరుపుతునట్లు సీఐ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) ప్రయాణికుల సమస్యలను తెలుసుకోవడానికి శుక్రవారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయంత్రం 3గంటల నుంచి 4గంటల వరకు కొనసాగుతుందన్నారు. ప్రయాణికులకు సంబంధించిన సమస్యలను 9959226152 ఫోన్ ద్వారా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని డీఎం కోరారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి స్పీకర్ సంతాపం

వికారాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతాపం తెలిపారు. బండారి రాజిరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో కాలనీలో సీఎంఆర్ ఆస్పత్రి వారు గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ ఆస్పత్రి వైద్యులు, స్థానిక మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.